
మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి..



**క్యూలైన్‌లో నిలబడి ఓటు వేసిన జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 30 ప్రభాతవార్త :** శాసనసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి. రవినాయక్ ఉదయం 7 గం.లకే మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ బంగ్లా చౌరస్తా వద్ద ఉన్న 222 పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటర్లు ఓటు వేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించామని, ఉదయం 7 గం.లకే జిల్లాలోని 835 పోలింగ్ కేంద్రాలు మరో మూడు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రారంభమైందని, పోలింగ్ కేంద్రాలలో మహిళలు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు, ప్రత్యేక టాయిలెట్లు, 80 ఏళ్లు పైబడిన వారికి హోమ్ ఓటింగ్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ఓటర్లందరూ నిర్భయంగా వారి ఓటుహక్కును వినియోగించుకునే విధంగా ఏర్పాటు చేశామని, ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ శాతం సరళిని గమనించేందుకు ఐడి ఓసిలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు అందితే తక్షణమే స్పందించే విధంగా 1950తో పాటు, జిల్లా ఫిర్యాదుల కంట్రోల్ విభాగం, మీడియా సోషల్ మీడియా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఓటర్లందరు వారి ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పరస్పర దాడులతో పోలింగ్..!

**- బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట...**

**- కంసానిపల్లిలో గువ్వలను అడ్డుకున్న గ్రామస్తులు**



ఈవీఎంలు పరిశీలించడానికి వెళ్తున్న గువ్వల

**అచ్చంపేట, నవంబర్30 ప్రభాతవార్త:**5 సంవత్సరాలకు ఒకసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలాభోలాకు లోబడకుండా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్.అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కానీ శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్న ప్రజలకు కొంత మంది అకతాయిలు తమ పార్టీకి మెజార్టీ రావాలి, తమ పార్టీ అభ్యర్థే గెలువాలని బలవంతంగా మా పార్టీ నాయకుడికి మీ ఓటు వేయాలని సూచించడంతో మరో పార్టీ నాయకులు అలా చేయడం సరికాదని ప్రశ్నించడంతో ఇరు పార్టీల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. అమ్రాబాద్ మండలం వంకేశ్వరం గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద అధికారులు సూచించిన బార్డర్ దాటి ప్రచారం నిర్వహించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాట మాట పెరిగి రాళ్ల దాడికి తెరలేపింది. బల్మూర్ మండలంలో ఈవీఎంలను పరిశీలించడానికి వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల బాలరాజును కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఈవీఎం, వీవీప్యాట్‌లను పరిశీలించడానికి మీకేమి అధికారం ఉందని ప్రశ్నించారు, మీరు వెళ్లకూడదని అడ్డుకోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించారు. అదే విధంగా ఉప్పునుంతల మండలం కంసానిపల్లి గ్రామంలో అదే తతంగం జరగడంతో కాంగ్రెస్ నాయకులు ఈవీఎంలను పరిశీలించడానికి వెళ్తున్న గువ్వలను అడ్డుకున్నారు.

## మక్తల్ ఎమ్మెల్యేపై తిరగబడిన గ్రామస్తులు..

**పోలింగ్ బూత్‌లోకి వెళ్లొద్దు అంటే కారుతో ఢీకొట్టబోయాడంటున్న గ్రామస్తులు**



చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని అడ్డుకుంటున్న గ్రామస్తులు

**మాగనూరు, నవంబరు 30 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై గ్రామస్తులు తిరగబడ్డారు. మాగనూరు మండలం,వర్కూరుగ్రామంలోని పోలింగ్ బూత్ 59,60లోకి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తనవెంట బిఆర్ఎస్ నాయకులను పోలింగ్ బూత్‌లోకి తీసుకెళ్లడానికి ప్రయత్నించగాగ్రామస్తులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. అంతలోనే ఎమ్మెల్యే కారు దిగుతూ మీసం తిప్పుతూ చూస్తా నన్నే ఆపుతారా అటూ నోటికొచ్చినట్లు మాట్లాడారని వర్కూరు గ్రామస్తులు తెలిపారు. ఎమ్మెల్యే గన్‌మెన్లు చివరకు జనాల నుంచి ఎమ్మెల్యేకు అడ్డుకట్ట వేయడంతో స్వయంగా ఎమ్మె ల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి వాహనాన్ని ముందుకు నడిపారు. వాహనాన్ని తీసుకువెళ్లే సమయంలో అతివేగంగా వెళుతూ ఒక్కసారిగా బ్రేక్ వేసి కారును తిప్పి అక్కడే ఉండే జనాలపైకి వెళ్లేంత పనిచే శారు. ఒక నియోజకవర్గ ఎమ్మెల్యే స్థాయి అభ్యర్థిగా ఉండి ప్రజలపై అలా మాట్లాడుతూ కారును అతివేగంగా తోలడంతో సోషల్ మీడియాలో విడియోలు వైరల్‌గా మారాయి. ఇది చూసిన వివిధ గ్రామాల ప్రజలు, నియోజకవర్గ ప్రజలు ఉన్నతాధికారులు స్పందించి ఎమ్మెల్యే అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఈవీఎంలను క్రమ పద్ధతిలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



**గద్వాల ప్రతినిధి నవంబర్ 30 ప్రభాతవార్త:** ఎన్నికల అనంతరం వచ్చిన ఈవీఎం లను బ్యాలెట్ యూనిట్ కంట్రోల్ యూనిట్లను క్రమపద్ధతిలో తీసుకుని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాలని జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. గురువారం ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో తాసిల్దారులు, టేబుల్ ఇంచార్జిలతో సమావేశం నిర్వహించి సూచనలు కోరారు. పోలింగ్ కేంద్రాల నుండి వచ్చిన వివి ప్యాట్ బ్యాలెట్ యూనిట్ కంట్రోల్ యూనిట్లను క్రమ పద్ధతిలో మీకు ఇచ్చిన లిస్టు ప్రకారం చెక్ చేసుకోవాలన్నారు. ఈవిఎం ఓపెన్ చేయకుండా సిరియల్ నెంబర్ కరెక్టుగా ఉందా లేదా అన్నది చెక్ చేసుకోవాలన్నారు. ఎక్కడైనా మారి ఉంటే మా దృష్టికి తీసుకురావాలని, మాక్ పోల్ సర్టిఫికేట్‌లో 50 ఓట్లు ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు అని రాసి ఉండాలని, ఎలక్షన్ బుక్ లెట్ 17ఏ, 17 సి ప్రకారం రిజిస్టర్లు అందజేయాలన్నారు. రిజిస్టర్ పోలింగ్ ఆఫీసర్ డైరీ తప్పక రాయాలన్నారు. టేబుల్ ఇంచార్జిలు తనిఖీ చేసి తీసుకోవాలన్నారు. పిఓ ఇచ్చిన మెటీరియల్‌ను సరిచూసుకుని వారి ద్వారా డిక్లరేషన్ సంతకంతో రాయించుకోవాలన్నారు. అన్ని ఈవీఎంలను స్ట్రాంగ్ రూముకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అపూర్వచౌహాన్, చీర్ల శ్రీనివాస్, ఏఓ బద్రప్ప, ఎంఆర్ఓ నరేష్ తదితరులు ఉన్నారు.

# ప్రశాంతంగా పోలింగ్..!



**సాయంత్రం ఏడు గంటలు దాటినా కొనసాగిన పోలింగ్**

**జిల్లా ఎన్నికల అధికారుల నిరంతర పర్యవేక్షణ**

**మహబూబ్‌నగర్‌లో 73.70 శాతం పోలింగ్**



వీల్‌చైర్‌లో వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్న వృద్ధురాలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 30 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎన్నికల సర్వే ప్రశాంతంగా కొనసాగింది. గురువారం ఉదయం 7 గం.లకు ప్రారంభమైన సాయంత్రం ఐదు గంటలకు ముగిసింది. అయితే కొన్నిచోట్ల ఐదు గంటల వరకు క్యూ లైన్‌లో ఓటర్లు నిలబడడంతో ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. పలు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 7 గం.ల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 73.70 శాతం పోలింగ్ నమోదైంది. మహబూబ్‌నగర్‌లో 69.32 శాతం, జడ్చర్లలో 73.80 శాతం, దేవరకద్రలో 74.70 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర పోలీస్ బలగాలతో పాటు, కర్ణాటక రాష్ట్ర, కేంద్రం బలగాలతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా, మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జి.రవి నాయక్ ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వెబ్‌కాస్టింగ్ సి విజిల్ పరిశీలించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11 గం.లలోపు మధ్యాహ్నం నాలుగు తర్వాత పోలింగ్ శాతం ఊపందుకుంది.

**ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు...**

మండల కేంద్రంలో 201 పోలింగ్ కేంద్రంలో జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ఓటుహ క్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి తన స్వగ్రామమైన దమగ్నాపూర్‌లో కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.



## మందుబాబుల క్యూ..

**- తెరుచుకున్న మద్యం దుకాణాలు**

**- నవంబర్ 30తో ముగిసిన వైన్స్ షాపుల గడువు**

**- నేటి నుంచి అమలులోకి నూతన పాలసీ 2023-25**



**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 30, ప్రభాతవార్త:** రాష్ట్ర శాసనసభ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 28న సాయంత్రం 5గంటలు మద్యం దుకాణాలు మూతపడ్డాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం తిరిగి 30న సాయంత్రం 5గంటల తెరవాల్సి ఉండడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలు ఓపెన్ చేశారు. అయితే దుకాణాలు తెరుచుకున్నప్పటికీ మద్యం దుకాణాల గడువు నవంబర్ 30తో ముగియనుండడంతో స్టాక్ నిల్వలు ఎక్కువగా ఉండకపోవడంతో చాలా వరకు వైన్స్ షాపులు తెరుచుకోలేదు. గత రెండేండ్ల కిందట 2021డిసెంబర్ 1నుంచి మద్యం పాలసీ ప్రారంభం కాగా రెండేండ్ల గడువు నవంబర్30తో ముగిసింది. అయితే తెలంగాణ ప్రభుత్వం గత మూడు నెలల కిందట మద్యం దుకాణాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసి, టెండర్లు నిర్వహించి దుకాణాలు కేటాయించడంతో లక్కీ డ్రాలో షాపులు పొందిన వారు డిసెంబర్ 1నుంచి రెండేండ్ల పరిమితితో షాపులు నిర్వహించనున్నారు. అయితే ఉమ్మడి జిల్లాలో మొత్తం నాలుగు డివిజన్లు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల ఉన్నాయి. జడ్చర్ల, కోస్గి, మహబూబ్‌నగర్, నారాయణపేట, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, ఆత్మకూరు, కొత్తకోట, వనపర్తి, అలంపూర్, గద్వాల కలిపి 14 సర్కిళ్లు ఉండగా శాసన సభ ఎన్నికల నేపథ్యంలో కేవలం నవంబర్ నెలలోనే రూ.187 కోట్ల మద్యం విక్రయాలు జరగడం గమనార్హం. అత్యధికంగా నాగర్‌కర్నూల్ డివిజన్‌లో రూ.50 కోట్ల వరకు సేల్స్ రాగా, అత్యల్పంగా వనపర్తి సర్కిల్‌లో వచ్చినట్లు సమాచారం.

## పోలింగ్ సరళి పరిశీలన..



పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ చేస్తున్న జిల్లా ఎన్నికల పరిశీలకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 30 ప్రభాతవార్త :** జిల్లాలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్వహించిన శాసనసభ ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రా ప్రత్యక్షంగా పరిశీలించారు. ముందుగా ఆయన మహబూబ్‌నగర్ పట్టణంలోని మహాత్మాగాంధి రోడ్డు ఉన్నత పాఠశాలలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. అలాగే దేవరకద్ర మండలం పెద్ద గోపులాపూర్‌లో సైతం పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం జడ్చర్ల హౌసింగ్ బోర్డు కాలనీలో పోలింగ్ ముగింపు ప్రక్రియను పరిశీలిం చారు. ఆ తదుపరి పాలమూరు విశ్వవిద్యాలయంలో ఓట్ల లెక్కింపు కేంద్రాలలోని పనులను తనిఖీ చేశారు.

## కౌంటింగ్ కేంద్రాలు సిద్ధం..

**- ఉమ్మడి జిల్లాలో 5ఓట్ల లెక్కింపు కేంద్రాలు**

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 30, ప్రభాతవార్త: రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. నవంబర్‌న పోలింగ్ ముగియనగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 5 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లాల వారీగా కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి పాలమూరులోని 11నియోజకవర్గాలకు సంబంధించి పాత జిల్లాలోనే ఓట్ల లెక్కింపు కేంద్రాలకు ఈసీ ఖరారు చేసింది. అయితే కల్వకుర్తి నియోజకవర్గం ఓట్ల లెక్కింపు మాత్రం రంగారెడ్డి జిల్లా పరిధిలో జరగున్నది. ఈమేరకు నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ కేంద్రాలు వివరాలు..

| అసెంబ్లీ నియోజకవర్గం | లెక్కింపు కేంద్రం |
|---|---|
| 1.మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర | ధర్మాపూర్‌లోని జేపీఎన్‌సీఈ కళాశాలలోని అబ్దుల్ కలాం భవన్ |
| 2.గద్వాల, అలంపూర్ | గద్వాల సమీపంలోని గోన్‌పాడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పాఠశాల |
| 3.నారాయణపేట, మక్తల్ | సింగారం క్రాస్‌రోడ్డులోని శ్రీదత్త బృందావన్ టీచర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ |
| 4.నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ | నాగర్‌కర్నూల్‌లోన నెల్లికొండ వద్ద అగ్రికల్చర్ మార్కెట్ యార్డు |
| 5. వనపర్తి | చిట్యాలలోని కొత్త మార్కెట్ గోదాం |

**కంట్రోల్ రూమ్‌లో ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న అధికారులు**



**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 30 ప్రభాతవార్త :** జిల్లా పరిధిలోని నారాయణపేట, మక్తల్ శాసనసభ నియోజకవర్గాలలో కొనసాగుతున్న పోలింగ్ పరిస్థితులు, ఓటింగ్ సరళిని జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో గల కంట్రోల్ రూమ్ ద్వారా వెబ్ క్యాస్టింగ్ పర్యవేక్షిస్తున్న ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ అభిషేక్ దేవల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్, అధికారులు పర్యవేక్షించారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు..



ఓటు హక్కును వినియోగించుకున్న నిరంజన్‌రెడ్డి, మేఘారెడ్డి, అనుజ్ఞ రెడ్డి , బీరం హర్షవర్ధన్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు, ఎల్లేని సుధాకర్ రావు, బర్రె లక్క (శిరీష), ఆల వెంకటేశ్వర్ రెడ్డి , మధు సూదన్ రెడ్డి, కొండా ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్.తేజస్ నంద్ లాల్ పవార్ ,ఎస్పీ.రక్షిత మూర్తి

**వనపర్తి ప్రతినిధి, నవంబర్ 30, ప్రభాతవార్త :** జిల్లాలోని వనపర్తి, దేవరకద్ర, కొల్లాపూర్ నియోజక వర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థులు తమ ఓటును వినియోగించుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి, బిఆర్ఎస్ అభ్యర్థి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నా రు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి.తూడి మేఘా రెడ్డి తన సొంత ఊరైన పెద్దమందడి మండలం మంగంపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేయగా, బీజేపీ అభ్యర్థి.అనుజ్ఞ రెడ్డి వనపర్తిలోని కేడిఆర్ నగర్ లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కొల్లాపూర్ నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మె ల్యే.బీరం హర్షవర్ధన్ రెడ్డి కొల్లాపూర్ స్కాలర్ పా ఠశాలలో ఓటు వేయగా, కొల్లాపూర్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ అభ్య ర్థి జూపల్లి కృష్ణారావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దకొత్తపల్లి మండలం మహాసముద్రంలో బీజేపీ పార్టీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్ రావు ఓటు వేశారు. పెద్దకొత్తపల్లి మండలం మరికల్ లో స్వతంత్ర అభ్యర్థి బర్రె లక్కల (శిరీష) ఓటు హక్కు వినియోగించుకున్నారు. దేవరకద్ర నియోజకవర్గం నుంచి బిఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్ రెడ్డి, సతీమణితో కలిసి బూత్పూర్ మండలం అన్నసాగర్ గ్రామంలో ఓటును వినియోగించుకున్నారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి.మధు సూదన్ రెడ్డి, కుటుంబ సమేతంగా చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామంలో క్యూలైన్ లో నిల్చొని ఓటు వేశారు. దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో 105 వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ వారి ఓటు తప్పకుండా వినియోగించుకోవాలని అభ్యర్థులు కోరారు. ఓటు హక్కును వినిమోగించుకున్న జిల్లా కలెక్టర్.ఎస్పీ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ నేపథ్యంలో జిల్లా కలెక్టర్.తేజస్ నంద్ లాల్ పవర్, ఎస్పీ.రక్షిత మూర్తిలు గురువారం తమ ఓటు హక్కును వినిమోగించుకున్నారు. వనపర్తి పట్టణంలోని 165 పోలింగ్ కేంద్రం వద్ద జిల్లా కలెక్టర్.తేజస్ నంద్ లాల్ పవర్ ఓటు వేశారు. అలాగే జిల్లా ఎస్పీ.రక్షిత మూర్తి పట్టణంలోని మర్రికుంట పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కును వినియోగించుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షణ చేశారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న నేతలు..



ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీ అభ్యర్థులు

**అచ్చంపేట, నవంబర్ 30 ప్రభాతవార్త:**సార్వత్రిక ఎన్నికలు గురువారం అట్టహాసంగా అధికారులు నిర్వహించారు. అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దంపతులు అమ్రాబాద్ మండలం వెలుమపల్లి గ్రామంలో, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ దంపతులు అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో, బీజేపీ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవని సతీష్ మాదిగ దంపతులు అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా అచ్చంపేట నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో ఏర్పాటుచేసిన ఎన్నికల పోలింగ్ బూత్‌లను కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చిక్కుడు వంశీకృష్ణ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు నడుచుకోవాలని, వికలాంగులు వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన సమయంలో వారికి తగు సహాయ సహకారాలు అందించి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని వారు సూచించారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న బిఆర్ఎస్ గద్వాల ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**ధరూర్ నవంబర్ 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామంలో బూత్ నెంబర్ 64 లో గద్వాల బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఆయన సతీమణి బండ్ల జ్యోతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఓటుహక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు



**కోయిల్‌కొండ, నవంబరు 30 ప్రభాతవార్త :** కోయిల్‌కొండ మండలంలోని శేరి వెంకటాపూర్ గ్రామంలో నారాయణపేట తాజా, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.



## ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

**శ్రీరంగపురం మండలం, నవంబర్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా, గురువారం ఉదయం నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మండల కేంద్రము తో పాటు మండలములోనీ అన్ని గ్రామాల లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. మండలంలో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ఉదయం 07 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 05వరకు సమయం ఉండగా..05 గంటలోపు క్యూలైన్లలో ఉన్న ఓటర్లకు మాత్రమే ఓటు వేసేందుకు అనుమతి ఇస్తామని అధికారులు తెలిపారు. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మండలంలోని మొత్తం 74.26 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగింది. ఈ ఎన్నికల ఓట్లలెక్కింపునుడిసెంబర్3నచేపట్టిఅదేరోజుఫలితాలు వెల్లడించనున్నారు.



వీల్‌చైర్‌పై వెళ్లి ఓటుహక్కును వినియోగించుకుంటున్న వృద్ధురాలు

**ఉప్పునుంతల, నవంబరు 30 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో చెదురు ముదురు ఘటనలు తప్ప ఎలాంటి సంఘటనలు జరగలేదు. బిఆర్ఎస్ అభ్యర్థి గువ్వల బాలరాజు మండలంలోని కంసాన్‌పల్లి, ఉప్పునుంతలలో పోలింగ్ కేంద్రాలకు వెళ్తుండగా కొంత గొడవలు జరిగాయి. అభ్యర్థి తప్ప ఎవరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లొద్దని వారించారు. అక్కడే ఉన్న పోలీసులు గొడవలు జరగకుండా జాగ్రత్తలు పాటించారు. ఉదయం 7 గం.ల నుండి ప్రారంభం కావడంతో ఉదయం వేళలోని తమ ఓటుహక్కును ఓటర్లు వినియోగించుకున్నారు. మండలంలో ఎలాంటి సంఘటన జరగ కుండా ఎస్సై గురుస్వామి ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## పోలింగ్ బూత్‌ను సందర్శించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

**నారాయణపేట ప్రతినిధి, నవంబరు 30 ప్రభాతవార్త :** నియోజకవర్గంలో మాగనూరు మండలంలోని 64,65,66,67 మోడల్ పోలింగ్ స్టేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ సందర్శించారు. అనంతరం పోలింగ్ ప్రక్రియ తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించాలని ఎన్నికల సిబ్బంది ఆదేశించారు.

## మక్తల్‌లో ఓటేసిన సందీప్‌కుమార్ మఖ్తల

**మక్తల్, నవంబరు 30 ప్రభాతవార్త:** మక్తల్‌లో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో సందీప్ కుమార్ మఖ్తల ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ పూర్వీకుల ప్రాంతమైన మక్తల్‌లో తొలి సారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్లు సందీప్ కుమార్ మఖ్తల తెలిపారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో వారు ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. ఆయనతో పాటు ఆయన సతీమణి భాగ్య లక్ష్మి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో యుకు వల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని, భవిష్యత్తులో యువతే కీలకం కానుందని తెలిపారు. యువకులు మరింతగా రాణించేందుకు కృషి చేయాలని అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శృతి, ప్రణీత్, శ్రీకాంత్, నర్సింహ పాల్గొన్నారు.



ఓటు వేసిన సందీప్ కుమార్ మఖ్తల దంపతులు

## ఓటేసిన ఎమ్మెల్యే అభ్యర్థులు



**మక్తల్, నవంబరు30 ప్రభాతవార్త:** నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేస్తున్న నేతలందరూ తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి మక్తల్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో సతీమణి వాకిటి లలితతో కలిసి ఓటేశారు. ఇక బిజెపి అభ్యర్థి జలంధర్‌రెడ్డి నర్వ మండల కేంద్రంలో బిజెపి అభ్యర్థి జలంధర్‌రెడ్డి తన సతీమణితో కలిసి ఓటేశారు. బిఆర్ఎస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సతీమణి చిట్టెం సుచరితారెడ్డితో కలిసి మక్తల్ యుపిఎస్‌లోఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇక బీఎస్పీ అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి తన సతీమణి అంజనారెడ్డితో కలసి ఆత్మకూర్ మున్సిపాలిటీలో ఓటేశారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి గవినోళ్ల వెంకట్రామరెడ్డితనసొంత గ్రామంసంగంబండలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. మిగతాఅభ్యర్థులు సైతంవారి సొంతగ్రామాల్లో ఓటు వేశారు.

## శాసనసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

**కల్వకుర్తి, నవంబర్ 30 ప్రభాతవార్త:** 2023 శాసనసభ ఎన్నికల్లో చెదురుమదురు ఘటనలుమినహా ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ స్వగ్రామం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామంలో ఓటు హక్కును వినియో గించుకున్నారు. కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కసిరెడ్డినారాయణరెడ్డి రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి తల్లోజు ఆచారి ఆమనగల్లులో ఓటును వేశారు. మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, తన సతీమణి అశ్లేషారెడ్డితో కలిసి తన స్వగ్రామమైన శేరి అప్పారెడ్డి పల్లిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా పలువురు నేతలు, పలువురు ప్రజా ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియో గించుకున్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు

## ఓటు హక్కును వినియోగించుకున్న చెంచు ఓటర్లు

- 9 ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఎన్నికల సిబ్బందికి కలెక్టర్ ఉదయ్‌కుమార్ అభినందనలు
- పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లపై చెంచు ఓటర్ల హర్షం
- 9 పోలింగ్ కేంద్రాల్లో 290 మంది ఓటర్లు
- 75 శాతం ఓటు హక్కును వినియోగించుకుంచుకున్న చెంచులు



చెంచు పెంటల్లో ఓటు వినియోగించుకుంటున్న చెంచు మహిళా

**అచ్చంపేట, నవంబర్30 ప్రభాతవార్త:** నల్లమల్ల అటవీ ప్రాంతంలో జీవనం గడుపుతున్న చెంచు గిరిజనులు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోవడానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై చెంచులు హర్షం వ్యక్తం చేశారు. చెంచు పెంట ల్లో నూతనంగా ఏర్పాటు చేసిన 9 పోలింగ్ కేంద్రాల పరిధిలోని చెంచు ఓటర్లు ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో దూర ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాలకు 25 కిలో మీటర్ల దూరం వరకు కాలి నడక వెళ్లాల్సి రావడంతో అంతంగా ఆసక్తి చూపేవారం కాదని వారు తెలిపారు. చెంచులు పూర్తి స్థాయిలో ఓటు హక్కును వినియోగించుకునేలా వారు నివాసం ఉంటున్న ప్రదేశంలోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. లింగాల మండలంలో 7, అమ్రాబాద్ మండలంలో 2 కొత్త పోలింగ్ కేంద్రాలను అటవీ ప్రాంతంలోని చెంచు పెంటల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లోని చెంచు ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్ చెంచు ఓటర్లకు ప్రత్యేక చొరవ తీసుకొని చెంచు ఓటర్లందరు ఓటు హక్కును వినియోగించుకునేలా ఏర్పాటు చేశారు. అందుకు ఎన్నికల సిబ్బందికి అవసరమైన మౌళిక వసతులను తాత్కాలికంగా ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ప్రక్రియను రికార్డు చేయించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చెంచు పెంటల్లో తొలిసారి ఏర్పాటు చేసిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో విజయ వంతంగా కొనసాగడంపై జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఎన్నికల సిబ్బందిని, ఓటు హక్కు వినియోగించుకున్న చెంచు ఓటర్లను అభినందించారు.



చెంచు పెంటల్లో పోలింగ్ ముగియడంతో ఈవీఎం బాక్స్‌లతో తిరిగి వస్తున్న ఎన్నికల సిబ్బంది



చెంచు పెంటల్లో ఓటు వేయడానికి వస్తున్న చెంచులు

## నిరంతర పర్యవేక్షణ

- ఓటింగ్ సర్వేపై అనుక్షణం ఆరా
- ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎన్నికల అధికారి జి.రవినాయక్




కంట్రోల్ రూమ్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

మీడియా మానిటరింగ్, 1950 కాల్ సెంటర్, జిల్లా ఫిర్యాదుల విభాగాల్లో ఎన్నికల పోలింగ్ సరళి, ఫిర్యాదులను అధికారులు, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. పోలింగ్ మొదలైనప్పటి నుంచి పూర్తయ్యే దాకా నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు.

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు30 ప్రభాతవార్త:** శాసనసభ ఎన్నికల నేపథ్యంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఎన్నికలకు సంబంధించి నిత్య సమీక్షలు, రివ్యూలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. గురువారం పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ సరళిపై అనుక్షణం ఆరా తీస్తూనే ఉన్నారు. సమీకృత జిల్లా అధికారుల కార్యలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి ఎన్నికల పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌కుమార్ మిశ్రాతో కలిసి పర్యవేక్షించారు. ఐడిఓసిలో వెబ్ కాస్టింగ్, సివిజిల్, మీడియా, సోషల్




ఐడిఓసిలో వెబ్ కాస్టింగ్ సి విజిల్ మీడియాను పరిశీలిస్తున్న అధికారులు

## పోలింగ్ సరళిని పరిశీలించిన తహసీల్దార్





పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న తహసీల్దార్

**ఇటిక్యాల, నవంబరు 30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గురువారం జరిగిన సాధారణ ఎన్నికలలో భాగంగా ఎర్రవల్లి చౌరస్తాలో గల పదవ బెటాలియన్‌లోని 15వ పోలింగ్ బూత్‌ను మహిళా పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయగా ఆకేంద్రాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్లు చెల్లించి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఉదయం పోలింగ్ బూత్‌లోని పోలింగ్ కేంద్రంలో అందరుమహిళా ఉద్యోగులు విధులు నిర్వహించారు. అంతే కాక ఇటిక్యాల, ఎర్రవల్లిలోని పోలింగ్ బూతులను తహసిల్దార్ వెంకటేశ్వర్లు పరిశీలించి పోలింగ్ సరళి వసతుల ఏర్పాటు వంటివి అడిగి తెలుసుకున్నారు. వీరివెంట సీనియర్ అసిస్టెంట్ అజిత్ పాల్గొన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే రావుల



కానాయపల్లి గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు

**కొత్తకోట, నవంబర్30, ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్ రెడ్డి దంపతులు వారి స్వగ్రామం కానాయపల్లి లోని బూత్ నంబర్ 259 లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఎన్నికల సరళిని పరిశీలించారు. కొత్తకోట పట్టణంతో పాటు మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.



ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ కుటుంబ సభ్యులు

## ఓటుహక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మాజీ ఎంపి, మాజీ ఎమ్మెల్యే

**ఇటిక్యాల, నవంబరు30 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలోని సాధా రణ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో సొంత గ్రామంలో ఓటుహక్కును ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు వినియోగించుకున్నారు. మండల పరిధిలోని వల్లూరు తన సొంత గ్రామంలో ఎమ్మెల్యే అబ్రహం తన డాక్టర్ అజయ్, ఉండవల్లి మండలంలోని పుల్లూరు గ్రామంలో ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయుడు, కాక కొండూరు గ్రామంలో మాజీ ఎంపి మంద జగన్నాథం, ఆయన తనయుడు మంద శ్రీనాథ్ వారి సొంత గ్రామాలలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా అయిజ మండ లం చిన్న తాండ్రపాడు గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ ఆయన సతీమణి, కుమారుడు, కోడులు వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలంపూర్ పట్టణంలో బీఎస్పీ పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రసన్నకుమార్, బిజెపి పార్టీ అభ్యర్థి రాజగోపాల్, ఆయా అభ్యర్థులు వారి సొంత గ్రామాలలో స్వతంత్ర అభ్యర్థులు ఓటుహక్కును వినియోగించుకున్నారు.



కొండేరులో ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ ఎంపి మందజగన్నాథం ఆయన తనయుడు మంద శ్రీనాథ్



మంగనూరులో ఓటుహక్కు వినియోగించుకున్న వికలాంగుడు



లట్టుపల్లిలో ఓటువేసి తిరిగి వస్తున్న గిరిజన మహిళలు



ఓటుహక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్లో నిల్చున్న ఓటర్లు

**బిజినేపల్లి, నవంబరు 30 ప్రభాతవార్త:** మండలంలోని అన్ని గ్రామాల్లో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం మండలంలో 64 పోలింగ్ బూతుల్లో ఆయా గ్రామాల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా గ్రామాల వారిగా మొత్తం మండలంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తే అక్కడక్కడ చెదురుముదురు సంఘటనలు చోటు చేసుకున్నాయి. టిఆర్ఎస్, కాంగ్రెస్, బిఎస్పీ పార్టీల మద్దతుదారులు తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలంటూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తూ కనిపించారు. నందివడ్డెమాన్‌లో ఓ పోలింగ్ బూత్‌లో ఈవిఎం మొరాయించడంతో దాదాపు అరగంటపాటు ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా జరిగింది.

అభ్యర్థి గువ్వల బాలరాజు పరిశీలించారు.

**అమరచింత, నవంబర్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికలు గురువారం అమరచింత మండలంలోని ఓటును వినియోగించుకుటకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మహిళలు, పురుషులు, వృద్ధులు, వికలాంగులు వీరితోపాటు కొత్తగా ఓటు వచ్చినవారు ఉత్సవంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందు జాగ్రత్త ఆత్మకూర్ సిఐ రత్నం, అమరచింత ఎస్సై, జగన్మోహన్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. తెలంగాణ రాష్ట్ర సార్వత్రిక ఎన్నికల భాగంగా మక్తల్ టిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం రామ్మోహన్ రెడ్డి, బిజెపి అభ్యర్థి, మాదిరెడ్డి జలంధర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి, వాకిటి శ్రీహరి అమరచింత పట్టణంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాల పోలింగ్ కేంద్రాలను ఓటింగ్ సరళిని పరిశీలించారు.

**బాలానగర్, నవంబరు 30 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో గురువారం ఉదయం నుంచి ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఓటరు స్లిప్‌తో పాటు వివిధ ఐడింటి కార్డులను తీసుకువచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీస్‌శాఖ వారి ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేందుకు ప్రజలుఆసక్తి కనబరిచారు. బాలానగర్ మండలంలోని మోతిఘనపూర్, పెద్దరేవల్లి, తిరుమలగిరి తదితర గ్రామాలలో పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 5 గం.ల తర్వాత కూడా కొనసాగినట్లు సమాచారం. మొత్తానికి బాలానగర్ మండలంలో ఓటింగ్ ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ముగాశాయి.

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**లింగాల, నవంబరు30 ప్రభాతవార్త:** లింగాల మండలంలో గురువారం అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. మొత్తం మండలంలో 45 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 30 వేల 63 మంది ఉండగా అందలో 15 వేల 86 మంది మహిళలు, 14 వేల 976 మంది పురుషులు ఉన్నట్లు పోలింగ్ సెక్టార్ అధికారిణి ఎంపిడిఓ గీతాంజలి తెలిపారు. మండలంలోని కొత్తకుంటపల్లి, అవుసలికుంట, లింగాల తదితర గ్రామాల్లో బిఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ వాతావరణం నెలకొంది. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. లింగాలలోని 200,203 పోలింగ్ కేంద్రాల్లో 6.30 గం.ల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉందని తెలిపారు. మండలంలో 204లో కేంద్రాల్లో జనాలు బారులు తీరారు. లింగాల మండలంలో జరుగుతున్న ఎన్నికల సరళిని ఎమ్మెల్యే

**ఉట్కూర్, నవంబరు30 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని వివిధ పోలింగ్ బూతులలో ప్రశాంత వాతావరణంలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వివిధ గ్రామాలలోని పోలింగ్ బూతులను డిఐజి ధృవ, ఎన్నికల సరళిని పరిశీలించారు. ఉట్కూర్ గ్రామంలో 72 శాతం పోలింగ్ నిర్వహించుకున్నారు. మండలంలోని తిప్పరాజుపల్లి గ్రామంలో జడ్పీటిసి అశోక్‌గౌడ్, ఉట్కూర్ గ్రామంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్, మాజీ జడ్పీటిసి అరవింద్‌కుమార్, కొత్తగా ఓటుహక్కు నిర్వహించుకున్న యువతీ యువకులు మాట్లాడుతూ తమ ఓటు వేయడం వల్ల సమాజ శ్రేయస్సు కోరే వారికి తమ ఓటుహక్కు వినియోగించుకున్నామని తెలియజేశారు.



నర్వలో ఓటుహక్కు వినియోగించుకున్న మక్తల్ బిజెపి అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, మాదిరెడ్డి పద్మజారెడ్డి

**ధరూర్ నవంబర్30 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్నిపాడు, భీంపురం గ్రామంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎమ్మెల్యే అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఉన్నారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి



ఓటింగ్లో ఉత్సాహంగా పాల్గొన్న కొత్త ఓటర్లు



ఎన్నికల సరళిని పరిశీలిస్తున్న డిఐజి ధృవ



భూత్పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటింగ్‌కు బారులు తీరి ఉన్న మహిళా ఓటర్లు



అన్నాసాగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్

# ప్రశాంతంగా పోలింగ్

- అన్నాసాగర్‌లో ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి ఆల..
- భూత్పూర్‌లో మున్సిపల్ చైర్మన్,మద్దిగట్లలో ఎంపిపి ఓటు హక్కు వినియోగం

**భూత్పూర్, నవంబర్ 30,ప్రభాతవార్త:** గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గం భూత్పూర్‌లో ప్రశాంతంగా ముగిసింది.తొలుత కొంత మందకొడిగా సాగినప్పటికి మధ్యాహ్నాం నుంచి ఓటర్లు భారీ సంఖ్యలో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు.ఈ సారి ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపిలు తమ ప్రాభవాన్ని చాటుకునేందుకు పెద్ద ఎత్తున ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించినట్లు తెలుస్తోంది.క్రితం ఎన్నికలకు పోల్చుకుంటే ఈ సారి ఎమ్మెల్యే ఎన్నికలకు ఓటింగ్‌శాతంతో పాటు ఓటర్ల సంఖ్యకూడా గణనీయంగా ఉన్నట్లు చెబుతున్నారు.ఈ సారి 18ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కును వినియోగించుకోవడం వల్ల ఓటింగ్ శాతం స్వల్పంగా పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. భూత్పూర్ మున్సిపాలిటీతో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు,శివారు పల్లెలు, తండాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.భూత్పూర్ పట్టణం కంటే గ్రామీణ ప్రాంతాలలో ఓటింగ్ సరళి పెరిగినట్లు పేర్కొంటున్నారు. సుధూర ప్రాంతాలు,పట్టణాలలో వలసలు వెళ్లిన కూలీలు,ఇతర వృత్తినైపుణ్యకార్మికులు తమ సొంతూళ్లకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.దేవరకద్ర సిట్టింగ్‌ఎమ్మెల్యే,బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన సోంతూరు భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో తన కుటుంబీకులతో కలిసి ఓటు హకును వినియోగించుకున్నారు. భూత్పూర్ పట్టణంలోని పదోవార్డులోని ఆరో పోలింగ్ బూత్‌లో పట్టణ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఇదేవిధంగా భూత్పూర్ ఎంపిపి తన సొంత గ్రామం మండలంలో మద్దిగట్లలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవీందర్ గోప్లాపూర్‌లో,రూరల్ అధ్యక్షుడు రాంరెడ్డి కరివెనలోను,కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మద్దిగట్లలో,పట్టణ అధ్యక్షుడు భూత్పూర్ మున్సిపల్ తొమ్మిదోవారుకు చెందిన లిక్కి నవీన్‌గౌడ్ భూత్పూర్‌లోను తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరితో స్వతంత్ర అభ్యర్థులు ప్రజా ఏక్తా పార్టీ అభ్యర్థి గడ్డం ఎల్లప్ప భూత్పూర్‌లో,ధర్మసమాజం పార్టీ అభ్యర్థి జంగయ్య కరివెనలో, మందడి వెంకటనర్సింహ్మారెడ్డి పాతమొల్గరలోను తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఓటింగ్ ఆరంభమైన మొదటి మూడు గంటలలో కేవలం 20నుంచి 23శాతం మాత్రమే పోలింగ్ జరిగింది.పది నుంచి ఒంటి గంట వరకు 35నుంచి 40శాతం వరకు పోలింగ్ అయినట్లు అధికారులు చెబుతున్నారు.భోజన విరామం అనంతరం ఓటర్లు కుప్పలు తెప్పలుగా తరలివచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు.మధ్యాహ్నాం మూడు గంటల వరకు 63శాతం ఓటింగ్ జరిగినట్లు మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహసిల్దార్ పులిరాజు తెలిపారు.మూడు నుంచి ఐదు గంటల వరకు ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగినట్లు కూడా అధికారులు పేర్కొంటున్నారు.పట్టణంలోని అమిస్తాపూర్ 5,6,7,8 వార్డులలోని ఓ పోలింగ్ బూత్ వద్ద అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకుడి కుమారుడికి కాంగ్రెస్ నాయకుడికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి ఇరువురు చొక్కాలు పట్టుకుని తోపులాట జరుగగా కొంత సేపు పోలింగ్ కేంద్రం వద్ద స్వల్ప ఉత్రిక్తత చోటు చేసుకుంది.భూత్పూర్ ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.సకాలంలో పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన ఓటర్లను ఆలస్యమైన పోలింగ్ అధికారులు ఓటింగ్‌కు అనుమతించారు.ఆలస్యం కారణంగా భూత్పూర్ పూర్తి పోలింగ్‌శాతం ఇదమిత్తంగా చెప్పలేకపోతున్నారు. భూత్పూర్ పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో మొత్తం మీద దాదాపుగా 70నుంచి 80 శాతం వరకుపోలింగ్ జరిందని తెలుస్తోంది.మొత్తం మీదభూత్పూర్ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో పోలింగ్ ప్రశాంతంగాను,సజావుగాను జరిగింది.



వనపర్తిలోని శ్రీనివాసపురంలో మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న యువత





ఓటును వినియోగించుకుంటున్న వృద్ధులు

**వనపర్తి ప్రతినిధి,నవంబర్ 30,ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల నగరా ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది.గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల పోలింగ్ జరిగింది.నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్యోగులు విధులు నిర్వర్తించారు.ఈ ఎన్నికల్లో వనపర్తి నియోజకవర్గంలో 296 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు.సమస్యాత్మక,అదనపు బలగాలను మోహరించింది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును నిర్వహించారు.

**72.6 శాతం ఓటింగ్:** వనపర్తి నియోజకవర్గంలో 2,71,151 మంది ఓటర్లు ఉండగా..అందులో పురుషులు 1,35,654,మహిళలు 1,35,491, ఇతరులు 06మంది ఉన్నారు.నియోజకవర్గంలో దాదాపు 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు జరిగిన ఎన్నికల పోలింగ్ 72.6శాతం ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవకతవకలు లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటింగ్ ప్రశాంతంగా ముగిసింది.

**ఎన్నికలకు భారీ బందోబస్తు:** జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు సజావుగా సాగేలా జిల్లా పోలీస్ శాఖ అన్ని రకాల చర్యలను చేపట్టింది.రెండు కంపెనీలలో సెంట్రల్ అర్మడ్ పోలీస్ ఫోర్స్ బలగాలు 182,ఏడు కంపెనీలు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ఆర్మూర్ పోలీస్ 716 మంది,కర్ణాటక పోలీసులు 450 మంది సిబ్బంది,తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ 3 కంపెనీలు 63 మంది సిబ్బంది,సీఐడీ హైద్రాబాద్ నుండి11 మంది,అదే విధంగా వనపర్తి జిల్లా పోలీసు విభాగంలో 470 మంది ఉండగా..మొత్తం 1892 సిబ్బందితో ఎన్నికల ఎలక్షన్ విధులకు భారీగా బందోబస్తు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ.రక్షిత మూర్తి గురువారం ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించి,పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు.ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకు జరిగిన ఎన్నికల ఓటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా ప్రశాంతంగా ముగిసింది.మారుమూల గ్రామాలకు ఈవీఎంల తరలింపులో భాగంగా ఎలువంటి ఆటంకం రాకుండా ఆకస్మిక వాహనాల తనిఖీ,బైక్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని,ఇందులో భాగంగా ప్రత్యేక 5 స్ట్రైకింగ్ ఫోర్స్,15 స్ట్రైకింగ్ ఫోర్స్ టీములుగా విభజించామని వీటిలో భాగంగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ టీంతో పాటు అనుకోని సంఘటన సంభవిస్తే దాన్ని ప్రతిఘటించేలా క్విక్ రియాక్షన్ టీంను ఏర్పాటు చేశామని అన్నారు.ఇప్పటికే ప్రతి ఒక్క టీం తమ తమస్థానాలలో విధులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియం లోని 103,104 పోలింగ్ కేంద్రాలు,హరిజనవాడలోని 108, 107,101,112,113 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ పరిశీలించారు.పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ పోలింగ్ సరళిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సజావుగా పారదర్శకంగా పోలింగ్ జరిగెల చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సోమేశ్ మిశ్రాతో కలిసి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలోని 130,131,133 పోలింగ్ కేంద్రాలు,కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయంలోని 134,132 డిప్యూటీ ఇంజనీర్ కార్యాలయంలోని 127 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద లాల్ పవార్ సందర్శించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ తీరును అడిగి తెలుసుకుని,పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ,కట్టుదిట్టమైన గట్టి ఉండాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

**అలంపూర్ నియోజకవర్గంలో 76.61 శాతం ఓటింగ్ నమోదు...**

**ఇటిక్యాల,నవంబరు 30 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలో గురువారం జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. నియోజకవర్గంలో 290 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ఉదయం 7 గం.లకు ప్రారంభమై సాయంత్రం 5 గం.ల వరకు కొనసాగగా 76.61 శాతం ఓటింగ్ నమోదైనట్లు అలంపూర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు పోలింగ్ ఏజెంట్లకు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించి అవగాహన కల్పించారు. అనంతరం ఉదయం 7 గం.లకు పోలింగ్ ప్రారంభమైంది. కొన్ని గ్రామాలలో పోలింగ్ బూతులలో ఈవిఎంలు నెమ్మదిగా పని చేయడంతో ఒక ఓటరుకు కనీసం ఐదు నిమిషాల సమయం పట్టిందని పలువురు అభిప్రాయపడ్డారు. సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ నిర్వహణ సాగింది.5 గంటలలోపు పోలింగ్ కేంద్రంలో క్యూలైన్ ఉన్నవారికి ఓటువేసే అవకాశం అధికారులు కల్పించారు. కొన్ని చోట్ల ఆధారాలు సరిగ్గా లేకపోవడంతో ఓటు వెయ్యని పరిస్థితి కనిపించింది. ఓటర్లను పోలింగ్ దగ్గరకు తీసుకొచ్చేందుకు ఆయా పార్టీల నాయకులు కష్టపడాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఓటర్లు ఓటు వేశారు కాని ఫలితం మాత్రం ఈవిఎంలో నమోదై ఉంది. 3వ తేదీ జరిగే ఓట్ల లెక్కింపుతో గెలుపు ఎవరిని వరిస్తుందో వేచిచూడాలి. కాగా అలంపూర్ నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు2లక్షల 37,938 మందిఉండగా 1లక్ష 84 వేల 740 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం నియోజకవర్గంలో 77.64 శాతంనమోదైంది. 1 లక్ష 17 వేల 850 మంది పురుషులు, 1లక్ష 20 వేల 81 మంది మహిళా ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.













# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- రాత్రి 9గంటల వరకు పలు చోట్ల కొనసాగుతున్న పోలింగ్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 30 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల్లో గురువారం రాత్రి అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ చాలా ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు. 3 నియోజకవర్గాల్లో 802 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగగా 5 గంటల వరకు 70.83 శాతం ఓటింగ్ పోల్ అయినట్లు, పూర్తి స్థాయిలో పోలింగ్ శాతం ఎన్నికల సిబ్బంది నివేదికల రిసీవింగ్ అనంతరం తెలియనున్నట్లు ఆయన తెలిపారు. పోలింగ్ సామరస్యంగా ప్రశాంతంగా జరగడంలో సహకరించిన నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట నియోజకవర్గాల ప్రజలు, ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఇతర ప్రాంతం నుంచి వచ్చిన భద్రత దళాలు, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా పట్టణంలోని 115వ పోలింగ్ బూత్‌లో కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 119వ, 123వ పోలింగ్ బూత్‌లలో ఈవీఎం, వీవీప్యాట్ మురాయించడంతో కొద్దిసేపు ఓటింగ్ సరళి నిలిచిపోయింది. ఆ స్థానంలో కొత్త ఈవీఎం, వీవీప్యాట్ అమర్చడంతో యదావిధిగా పోలింగ్ కొనసాగింది. అనంతరం ఆయన నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన రిసీవింగ్ ప్రక్రియ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. 3 నియోజకవర్గాల నుంచి వచ్చే ఈవీఎంల రిసివింగ్ అత్యంత జాగ్రత్తగా పరిశీలించి తీసుకోవాలని, తీసుకున్న ప్రతి ఈవీఎంను సంబంధిత నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చాలన్నారు. 8వేల మంది ఎన్నికల సిబ్బందికి ఏర్పాటు చేసిన రాత్రి భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందిని వారి వారి స్వస్థలాలకు బస్సుల ద్వారా ఉచితంగా చేరవేయాలని సూచించారు. ఏ ఒక్కరికి ఇబ్బందులు లేకుండా రిసీవింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు.ఆయన వెంటనాగర్‌కర్నూల్ రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు, నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమిషనర్ జయంత్‌కుమార్‌రెడ్డి, ఏపీఆర్ఓ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న జిల్లా కలెక్టర్



రిసీవింగ్ కేంద్రానికి తరలివస్తున్న ఎన్నికల సిబ్బంది



రిసీవింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

# ప్రశాంతంగా పోలింగ్

- మండలంలో 84 శాతం పోలింగ్ నమోదు
- 201 పోలింగ్ కేంద్రంలో మొరాయించిన ఈవీఎం
- ఓటుహక్కు వినియోగించుకున్న జడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ అభ్యర్థి జిఎంఆర్



**చిన్నచింతకుంట,నవంబరు 30 ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. మండల కేంద్రంలోని 201 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం గంటన్నరపాటు మొరాయించడంతో అధికారులు సరిచేసి యధావిధిగా పోలింగ్‌ను కొనసాగించారు. మండలంలో 29 వేల 817 ఓటర్లకుగాను 25 వేల 16 ఓట్లు పోలయ్యాయని మండల తహసిల్దార్ కృష్ణయ్య తెలిపారు. 4801 ఓట్లను వినియోగించుకోలేదు. వీటిలో 12,595 మహిళలు, 12,321 పురు షులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 84 శాతం పోలింగ్ నమోదైనట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలో 202 పోలింగ్ కేంద్రంతో పాటు ఉంద్యాల, పల్లమర్రి గ్రామాలలో సాయంత్రం 6 గం.ల వరకు పోలింగ్ కొనసాగింది. పల్లమర్రి గ్రామంలో పోలింగ్ మందకొడిగా సాగింది. ఆ గ్రామంలో 1200ల మంది ఓటర్లకుగాను ఒకే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఓటర్లు ఇబ్బందిపడ్డారు. ఆ గ్రామంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఓటర్లు కోరుతున్నారు. వికలాంగులు, వృద్ధులను పోలింగ్ కేంద్రాల వద్దకు వాలం టీర్లు వీల్‌ఛైర్‌లో తీసుకెళ్లారు.

**ఓటుహక్కు వినియోగించుకున్న ప్రముఖులు:** మండల కేంద్రంలో 201 పోలింగ్ కేంద్రంలో జడ్పీ ఛైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి తన స్వగ్రామమైన దమగ్నాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.





ఓటుహక్కు వినియోగించుకున్న మధుసూదన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు



ఓటుహాకు ్కను వినియోగించుకున్న బిఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

## ఓటు హక్కును వినియోగించుకున్న పటాన్‌చెరు నియోజకవర్గం అభ్యర్థులు

**పటాన్‌చెరు, నవంబర్ 30, ప్రభాతవార్త:** తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా గురువారం రోజు ఉదయం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే





ఓటుహాకు ్కను వినియోగించుకున్న బీఎస్పీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, బిజెపి పార్టీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్

పటాన్‌చెరు నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటగా బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి ఆయన సతిమణితో కలిసి ఉదయం పటాన్‌చెరు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌గౌడ్ అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్

పరిషత్ ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేసిన 138 పోలింగ్ బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బీఎస్పీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ తన స్వగ్రామమైన చిట్కుల్‌తో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ పటాన్‌చెరు పట్టణంలోని బూత్ నంబర్ 209లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి**



ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

**వెల్దుర్తి, నవంబర్30 ప్రభాతవార్త:** నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి తన స్వగ్రామమైన మండల కేంద్రమైన మాసాయిపేటలోని 21వ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## హుస్నాబాద్‌లో పోలింగ్ ప్రశాంతం

**-ఐదుగంటల వరకు 77.81శాతం పోలింగ్ నమోదు**

**-సమయం ముగిసినా కొనసాగిన పోలింగ్**



హుస్నాబాద్ కాంగ్రెస్ శాసనసభ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తన ఓటు హక్కును వినియెగించుకుంటున్న దృశ్యం

**హుస్నాబాద్, నవంబరు30, ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజవక్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ఎలాంటి అవాంఛనీయసంఘటనలు జరగకుండా ప్రశాతంగా కొనసాగింది. పోలింగ్ గురువారం సాయంత్రం ఐదుగంటల వరకు 77.81శాతం వరకు నమోదయ్యింది. ఈ సాయంత్రం ఐదుగంటలు ముగిసిన అనంతరం ప్రహరీలోపల ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా వారికి సమయం ఉండడంతో ఓటర్లు తమ ఓటును వినియోగించుకుంటున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గకేంద్రమైన హుస్నాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తమ కుటుంబంతో సహా పోలింగ్ బూత్‌కు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకున్నారు,

## ఎన్నికల కోడ్ ఉల్లఘించిన అందోల్ ఎమ్మెల్యే

**టేక్మాల్, నవంబరు 30, ప్రభాతవార్త:**

అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఎన్నికల కోడ్ ఉల్లఘించారు. గురు వారం టేక్మాల్ మండలంలో ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ శాతాన్ని తెలుసున్నారు. అనంతరం టేక్మాల్ నుండి బొడ్మట్‌పల్లి గ్రామం వరకు ర్యాలీగా బొడ్మట్‌పల్లి గ్రామానికి వచ్చి పోలింగ్ బూత్‌లోకి వెళ్లి పోలింగ్ శాతాన్ని తెలసుకున్నారు. 5.20 నిమిషాలకు ఇంకా పోలింగ్ పూర్తి కాలేదు. ఇంకా వంద మంధి ఓటర్లు ఓటు వేసేందుకు గాను పోలింగ్ బూత్ ఆవరణంలో ఉన్నారు. అక్కడి నుండి తన కార్యకర్తలతో బైక్ ర్యాలీగా బొడ్మట్‌పల్లి చౌరస్తా వరకు వచ్చారు. ఎన్నికలు జరుగుతుండగానే ర్యాలీ తీయడంపై ఓటర్లు మండి పడుతున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికి ర్యాలీగా వెళ్తు పార్టీ నినాధాలతో కూడిన ఆంశాలను బహిరంగానే తమ పార్టీకి ఓటు వేయాలని అరవడం ఏంటని, ఇంతా బహటంగా ఎన్నికల కోడ్‌ను ఉల్లఘింస్తే అధికారులు చూస్తు ఉరుకుంటారా అని వారు ప్రశ్నిస్తున్నారు. సాయంత్రం6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లఘించిన ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఎఆర్‌ఎ వివరణ :** టేక్మాల్ మండల ఎన్నికల అధికారి క్రిష్ణను ప్రభాతవార్త వివరణ కోరగా ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ర్యాలీలు తీయవద్దని ఎన్నికల కోడ్ ఉల్లఘించినట్టే అన్నారు. అనుమతి పొందకుండా ర్యాలీలు తీయకుడదన్నారు. డిసెంబర్ 3వ తేది వరకు మాడల్ కోడ్ అమలు లో ఉంటుందన్నారు.



ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు



ఓటు హక్కును వినియోగించుకున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్



చేర్యాలలో పెద్దమ్మగడ్డ పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు



ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన 87ఏళ్ళ వృద్ధురాలు

# ఉత్సాహంగా ఓటుహక్కును వినియోగించుకున్న ప్రజలు

**మెదక్ రూరల్, నవంబర్30 ప్రభాతవార్త:**

సాధారణ ఎన్నికల్లో భాగంగా మెదక్ జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన శాసన సభ ఎన్నికల్లో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో గంట గంటకు పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. ఉదయం 7 గంటలకే ప్రారంభమైన పోలింగ్ కేంద్రాల్లో తొలుత మెల్లగా ప్రారంభమైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి 11 గంటల తరువాత భారీగా తరలి వచ్చారు. ఉదయం 9 గంటల వరకు మెదక్ నియోజకవర్గంలో 9.99 శాతం పోలింగ్ అవ్వగా, నర్సాపూర్ నియోజకవర్గంలో 9.01 శాతం



ఐటిఐ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న కార్పోరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

పోలింగ్ అయ్యింది.

**మెదక్ పట్టణంలో ప్రశాంతంగా పోలింగ్..**

మెదక్ అర్బన్, నవంబర్30 ప్రభాతవార్త: సాధారణ ఎన్నికల్లో భాగంగా గురువారం మెదక్ పట్టణంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మెదక్ పట్టణంలోని 32 వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద పుర ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటల నుండి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. పట్టణ ప్రముఖులు మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు మెదక్ పట్టణంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**చేర్యాలలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్**



ఓటు వేసేందుకు గాను బారులు తీరిన ఓటర్లు

**చేర్యాల, నవంబర్ 30, ప్రభాతవార్త** సిద్దిపేట జిల్లా జనగామ నియోజకవర్గం చేర్యాల మండలంలో అసెంబ్లీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం చేర్యాల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రజలు ఉదయం 7గంటల నుండే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. జనగామ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,37,108 ఓటర్లు ఉండగా, చేర్యాల మండలంలో మొత్తం ఓటర్లు 44217 ఉండగా అందులో పురుషులు 22051, మహిళలు 22166 ఉన్నారు. సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

**డబ్బులు ఇవ్వలేదని ఆకునూరులో ఓటర్ల ఆందోళన...**

చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఓ పార్టీకి చెం



ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు

దిన నాయకులు హైదరాబాద్‌లో ఉన్న వారిని గ్రామానికి వచ్చి ఓటేస్తే రవాణా చార్జీలు, ఓటుకు గింత ఇస్తానని చెప్పి పిలిపించుకుని డబ్బులు ఇవ్వకపోవడంతో గ్రామంలో కొంత సేపు ఆందోళన వాతవరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి ఓటర్లకు సర్ధిచెప్పి ఓటు హక్కును వినియోగించుకునేలా చేశారు.

**ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు...**

చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

**ఓటను సద్వినియోగం చేసుకున్న కార్పోరేటర్లు**

**రామచంద్రాపురం, నవంబరు 30, ప్రభాతవార్త:** మండలంలోని భారతీ నగర్, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా పోలింగ్ కేంద్రాలలో గురువారం జరిగిన శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఐటిఐ కాలేజీ పోలింగ్ కేంద్రంలో కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో, రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాశీరెడ్డిపల్లి పోలింగ్ బూత్‌లో కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటును సద్వినియోగం చేసుకున్నారు.

**న్యాల్‌కల్‌లో..**



కాశీరెడ్డిపల్లి పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన కార్పోరేటర్ పుష్పనగేష్ కుటుంబ సభ్యులు

**న్యాల్‌కల్, నవంబరు 30, ప్రభాతవార్త:** తొలి మారు ఓటు హక్కును వినియోగించుకున్న యువత ఆనందానికి అవదులు లేవని చెప్పవచ్చు. మండలంలోని 39 గ్రామాల్లో 47వేల 445 మంది ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన 62 కేంద్రాల్లో గురువారం ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**మునిపల్లిలో..**

**మునిపల్లి, నవంబరు 30, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం శాసన సభ ఎన్నికలను పురస్కరించుకుని పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని మేళ సంఘం గ్రామంలో 1200 మంది ఓటర్లకు ఒకే పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఓటర్లు తమ ఓటును వినియోగించుకునేందుకు క్యూలైన్‌లో అధిక సమయం వేచిచూడాల్సి వచ్చింది. ఆయా గ్రామాల్లో ఆయా పార్టీల నాయకులు, అధ్యక్షులు, ప్రజాప్ర



గోమారంలో కుటంభ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినయోగించుకున్న బిఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి

తినిధులు తమ ఓటు హక్కును తమ తమ గ్రామాల్లో సద్వినియోగం చేసుకున్నారు.

**ప్రశాంతంగా ముగిసిన పోలింగ్**

**చౌటకూరు/పుల్కల్, నవంబరు 30, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పుల్కల్, చౌటకూరు మండలాల్లోని ఆయా పోలింగ్ కేంద్రల వద్ద ప్రత్యేక బలగాల నిఘాలో ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**టేక్మాల్‌లో..**

**టేక్మాల్, నవంబరు 30, ప్రభాతవార్త:** టేక్మాల్ మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. టేక్మాల్



కుటుంబ సభ్యులతో ఓటు హక్కు వినియోగించుకున్న రామాయంపేట మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్‌గౌడ్

మండలంలోని 29 పంచాయితీలున్నాయి. అందులో 28,404 ఓటర్లున్నారు. టేక్మాల్ మండలంలో24,239 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో మొత్తం 84.24 శాతంఓటింగ్ శాతం నమోదు అయింది.

**శివ్వంపేట మండలంలో..**

**శివ్వంపేట, నవంబర్30 ప్రభాతవార్త:**

శివ్వంపేట మండల వ్యాప్తంగా గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 55 పోలింగ్ స్టేషన్లలోని ఈవీఎంలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో భద్రపరిచారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శివ్వంపేట ఎస్ఐ రవికాంత్‌రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా శివ్వంపేట మండల కేంద్రంలో జెడ్పీటీసీ సభ్యులు పబ్బా మహేష్‌గుప్త, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, ఏదుల్లాపూర్ గ్రామంలో ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, కేహెచ్ఆర్ ట్రస్టు చైర్మన్, స్థానిక సర్పంచి కల్లూరి కీర్తన హనుమంతరావులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**ఓటు హక్కును విని యోగించుకున్న ఆయా పార్టీల అభ్యర్థులు**

**నర్సాపూర్, నవంబర్ 30.ప్రభాతవార్థ:** నర్సాపూర్ అసెంబ్లీ సేగ్మేంట్ లో గురువారం జరిగినా ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ మేరకు ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు వారి వారి స్వంత గ్రామాల్లో వారి



తక్కడపల్లిలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ మేరకు బిఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును విని యోగించుకున్నారు. అదేవిదంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి స్వగ్రామమైన మాసాయిపేటలో భార్య శైలజారెడ్డి తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే నర్సాపూర్ లో బిజెపి అభ్యర్థి మురళీయాదవ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిదంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి తన స్వగ్రామమైన కౌడిపల్లి కేంద్రంలో భార్య సుజాత తో కలిసి తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ గ్రామంలో ఎంపిటిసీ సంధ్యారాణిచత్రునాయక్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు



చిన్నశంకరంపేటలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్య

ఆంజనేయులుగౌడ్ ఆయన సతీమణి తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**నారాయణఖేడ్‌లో ...**

**నారాయణఖేడ్, మనూరు, నవంబర్ 30 ప్రభాతవార్త:** గురువారం జరిగిన శాసన సభ ఎన్నికల్లో భాగంగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మహారెడ్డి భూపాల్‌రెడ్డి తన సొంత గ్రామమైన కల్హేర్ మండలంలోని ఖానాపూర్ కె లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బిజేపీ అభ్యర్థి జనవేడే సంగప్ప కంగ్టి మండలంలోని



ఓటు హక్కును వినియోగించుకుంటున్న యువకులు

చౌకన్‌పల్లి గ్రామంలో ఓటు ను వినియోగించుకున్నారు. అదే విధంగా బీఎస్పీ అభ్యర్థి మనూరు మండలంలోని ఎన్.జి.హుక్రానలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**పుల్కల్ మండలంలో ప్రశాంతంగా పోలింగ్**

**పుల్కల్, నవంబరు 30, ప్రభాతవార్త:** ఉమ్మడి పుల్కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో గురువారం శాసన సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. లింగంపల్లి గ్రామంలోని 265 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం 40 నిమిషాల పాటు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ఆరంభం అయింది. గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా పోలీసు బందోబస్తును నిర్వహించారు. చౌటకూరులో అత్యధికంగా 2707 మంది ఓట్లకు గాను 2218 మంది (81 శాతం) ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కోర్పోల్‌లో 2562 ఓట్లకు గాను 2128 మంది ఓట్లను (83శాతం) వినియోగించుకున్నారు.

**కొల్చారం మండలంలో..**

**కొల్చారం, నవంబర్30 ప్రభాతవార్త:**

శాసన సభ ఎన్నికల్లో భాగంగా గురువారం కొల్చారం మండలంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండల కేంద్రమైన కొల్చారంతో పాటు మండల పరిధిలోని 21 గ్రామ పంచాయితీల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ స్టేషన్ల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండలంలో అత్యధికంగా తుక్కాపూర్‌లో 97 శాతం ఓటింగ్ నమోదైంది. మండల కేంద్రమైన కొల్చారంలో 84.7 శాతం పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొల్చారం మండల



ఓటు వేశామని తెలుపుకుంటున్న ఎంపిపి ఉపాధ్యక్షులు

వ్యాప్తంగా 32 పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ శాంతియుత వాతావరణంలో కొనసాగింది. స్వేచ్ఛగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించచుకున్నారు. ఎక్కువ శాతం పోలింగ్ నమోదుకు ఓటర్లు ఆసక్తి చూపారు. దాంతో పోలింగ్ స్టేషన్‌ల వద్ద రాత్రి వరకు పోలింగ్ జరిగింది. మండల పరిధిలోని వరిగుంతంలో జెడ్పీటీసీ మేఘమాల సంతోష్, ఎనగండ్లలో ఎంపీపీ మంజుల కాశీనాథ్, కొల్చారంలో సర్పంచి కరెంటు ఉమా రాజాగౌడ్, ఎంపీటీసీ పాల్వంచ అరుణ కృష్ణాగౌడ్, సర్పంచి వీరారెడ్డి, అప్పాజిపల్లిలో సర్పంచి చలం ఝాన్సీ యాదగిరి, రంగంపేటలో సర్పంచి బండి సుజాత రమేష్, ఎంపీటీసీ గోకని మాధవి రాజాగౌడ్, వై. మాందాపూర్‌లో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, తుక్కాపూర్‌లో సర్పంచి మాధవి శ్రీశైలం, పైతరలో సర్పంచి సంతోష



బిఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి ఖానాపూర్ కె లో ఓటు హక్కును వినియోగించుకున్న దృశ్యం

ఎల్లేశం, సంగాయిపేటలో సర్పంచి మాసన శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**రామాయంపేట మండలంలో..**

**రామాయంపేట/రామాయంపేట మున్సిపాలిటీ, నవంబర్ 30, ప్రభాతవార్త :**

రామాయంపేట పట్టణంతో సహా మండల వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు గురువారం నాడు ప్రశాంతంగా జరిగియి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని అన్ని



యూసూఫ్‌పేటలో బారులు తీరిన ఓటర్లు

గ్రామాలలో 70 నుండి 80 శాతం వరకు పోలింగ్ జరిగినట్లు సమాచారం అందింది. అయితే మండల వ్యాప్తంగా ఎంత పోలింగ్ శాతం జరిగిందో తెలియాల్సి ఉంది. పట్టణంలో అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ఉదయం పూట ఓటర్లు బారులు తీరి కనిపించారు. దాదాపుగా అన్ని పోలింగ్ స్టేషన్‌లలో వికలాంగుల కోసం ఎన్నికల అధికారులు ట్రై సైకిల్‌లను అందుబాటులో ఉంచి, వారిని పోలింగ్ బూతులలోకి తీసుకెళ్లి, తిరిగి వదిలిపెట్టారు. అలాగే పోలింగ్ స్టేషన్ వద్ద ఓటర్లు ఇబ్బందులు కలుగకుండా నీటి వసతి, టెంట్లు లాంటి వసతులు కల్పించారు. మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఉదయం 8 గంటల లోపే తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకుల మధ్య ఘర్షణ

**మెదక్ అర్బన్, నవంబర్ 30, ప్రభాతవార్త:**

కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు దాడి చేశారని ఆరోపిస్తూ, పట్టణ పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న ఘటన గురువారం మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. మెదక్‌లోని జూనియర్ కళాశాల 131 పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిని ఒకరు తోచుకోవడంతో ఈ దాడిలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌కు స్వల్ప గాయాలైనట్లు బిఆర్ఎస్ నాయకుడు సాద్దక్ పట్టణ పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘర్షణ విషయంలో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను పోలిస్ స్టేషన్‌కు తరలించారని తెలుసుకున్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్ భార్య శివానీ కారులో పోలిస్ స్టేషన్ వద్దకు రాగా అక్కడే ఉన్న కొంత మంది శివానీ కారుపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న ఇరు వర్గాలు బారీ సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీస్ స్టేషన్ వద్ద రెండు పార్టీలకు చెందిన ప్రధాన నేతలు రావడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరు వర్గాలపై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రెండు పార్టీల నేతలు మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**మహిళపై దాడి చేస్తారా....శివానీ**

మహిళా ఎమ్మెల్యే ఉన్న ప్రాంతంలో ఒక మహిళపై బీఆర్ఎస్ నేతలు దాడి చేయడంపై కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్ భార్య శివానీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ తాను కొర్విపల్లిలో ఓటు వేసి వయా మెదక్ నుంచి రామాయంపేట వెళ్తున్న తరుణంలో మెదక్ పట్టణంలో బిఆర్ఎస్ నాయకులు తనపై దాడి చేయడానికి ప్రయత్నించారని అన్నారు. మహిళా ఎమ్మెల్యే ఉంది మరోక మహిళపై తన అనుచరులతో దాడి చేయించడం సమంజసం కాదని అన్నారు.

## ఎన్నికల విధి నిర్వహణలో గుండెపోటుతో సుధాకర్ మృతి ఇస్నాపూర్‌లో ఘటన

**పటాన్‌చెరువు, నవంబర్ 30, ప్రభాతవార్త:**

త తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. పోలింగ్ విధుల్లో పాల్గొన్న ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందారు. ఈ ఘటన పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ వెటర్నరీ విభాగంలో అసిస్టెంట్‌గా పని చేస్తున్న సుధాకర్ (48), ఉద్యోగికి పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లోని పోలింగ్ బూత్ నంబర్ 248లో ఎన్నికల విధులు కేటాయించారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఏర్పాట్లు చేసుకుంటుండగా చాతిలో నొప్పి అంటూ ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయారు. వెంటనే సుధాకర్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెంది నట్లు వైద్యులు దృవీకరించారు. పోలింగ్ విధులకు తమతో వచ్చిన సహచర ఉద్యోగి ప్రాణాలు కోల్పోవడంతో మిగతా సిబ్బంది విషాదం లో మునిగిపోయారు.